పల్లెలు, వార్డుల్లో 'ప్రజాపాలన'

- భాగస్వాములైన ప్రజాప్రతినిధులు, అధికారులు
- ఆరు గ్యారెంటీల అమలు కోసం దరఖాస్తుల స్వీకరణ
- నిర్వహణ తీరును పర్యవేక్షించిన కలెక్టర్ హనుమంతు, జిల్లా నోడల్ అధికారి

నందిపేట మండలం మాయాపూర్‌లో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు

ధర్పల్లి మండలం కేశారంలో దరఖాస్తులను స్వీకరిస్తున్న అధికారులు

రంజిత్‌నాయక్ తండాలో దరఖాస్తులను పరిశీలిస్తున్న డీఆర్డీవో చందర్‌నాయక్

నమస్తే తెలంగాణ యంత్రాంగం, డిసెంబర్ 28 : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమాన్ని జిల్లాలో గురువారం ప్రారంభించారు. జనవరి 6వ తేదీ వరకు కొనసాగనున్న ఈ కార్యక్రమం.. గ్రామపంచాయతీలు, వార్డుల వారీగా షెడ్యూల్‌ను ఖరారు చేశారు. ఇందులో భాగంగా మొదటి రోజైన గురువారం 112 గ్రామపంచాయతీలు, నాలుగు మున్సిపాలిటీల పరిధిలోని 146 మున్సిపల్ వార్డుల్లో ప్రజాపాలన సభలు కొనసాగాయి. అధికారులు తమ సిబ్బందితో కలిసి దరఖాస్తులను స్వీకరించారు. వివరాలను రిజిస్టర్లలో నమోదు చేస్తూ దరఖాస్తుదారులకు రసీదులను అందజేశారు. ఆరు గ్యారెంటీల్లో భాగంగా మహాలక్ష్మీ, రైతుభరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇల్లు, చేయూత పథకాలకు సంబంధించి ప్రజలు పెద్దసంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వ పాలనను ప్రజల ముంగిట్లోకి తెస్తూ వారి సమస్యలను పరిష్కరించేందుకు, ఆరు గ్యారెంటీల ద్వారా లబ్ధి చేకూర్చేందుకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామని ఎమ్మెల్యేలు తెలిపారు.

రెండు గంటల్లోనే ముగిసిన 'ప్రజాపాలన'

ఖలీల్‌వాడి, డిసెంబర్ 28 : జిల్లా కేంద్రంలోని 8వ డివిజన్‌లోని నలంద పాఠశాలలో గురువారం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమం రెండు గంటల్లోనే ముగిసింది. ఉదయం 10.30 గంటలకు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి నగర మేయర్ దండు నీతూ కిరణ్ హాజరయ్యారు. మధ్యాహ్నం 12.20 గంటలకు అధికారులు కార్యక్రమాన్ని ముగించారు. కాలనీవాసులు దరఖాస్తులు అందజేసేందుకు వచ్చి పాఠశాల సిబ్బందిని అడగగా.. లంచ్‌కి వెళ్లారని, 3.30 గంటలకు వస్తారని సమాధానం చెప్పారు. దీంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మొదటి రోజే ఇలా నిర్వహిస్తే ఎలా అని అసంతృప్తి వ్యక్తం చేశారు. రేషన్‌కార్డులు ఉన్నవారికి మాత్రమే ఆరు గ్యారెంటీలు వర్తిస్తాయని ప్రభుత్వం చెబుతున్నదని, రేషన్‌కార్డులు లేని వారి పరిస్థితి ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఆన్‌లైన్‌లో కాకుండా, మ్యానువల్‌గా దరఖాస్తులు తీసుకోవడం ద్వారా సమయం వృథా అవుతుందని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేశారు. అధికారులు రేషన్‌కార్డుల దరఖాస్తుల విషయంలో ప్రజలకు ఏమీ చెప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

నగరంలో దరఖాస్తుల స్వీకరణను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

భీమ్‌గల్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కన్నె ప్రేమలత, అధికారులు

ఆర్మూర్‌లో మున్సిపల్ చైర్ పర్సన్ వినిత, అధికారులు

ఈ ఏడాది 1,329 కేసులు నమోదు

- ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి

నిజామాబాద్ క్రైం, డిసెంబర్ 28 : జిల్లావ్యాప్తంగా ఈ ఏడాది భారీగా మత్తు పదార్థాలు పట్టుకొని 1,329 కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి వెల్లడించారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన గురువారం వెల్లడించారు. అల్ప్రాజోలం 3.6 కేజీలు, క్లోరల్ హైడ్రేట్ 49.9 కేజీలు, ఎండు గంజాయి 259.5 కేజీలు, గంజాయి మొక్కలు 68, నల్లబెల్లం 4,540 కేజీలు, అలం 1,026 కేజీలు, ఎన్‌డీపీఎస్ 108 లీటర్లు, దేశీదారు 174 లీటర్లు, అక్రమంగా తరలించిన లిక్కర్ 2,530 లీటర్లు, అక్రమ కల్లు 85,224 లీటర్లు, పాకం 82,225 లీటర్లతో పాటు 68 వాహనాలను సీజ్ చేశామని వివరించారు. ఈ అక్రమ మత్తు పదార్థాల స్మగ్లింగ్, విక్రయాలకు పాల్పడిన 707 మంది నిందితులపై కేసులు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

న్యూ ఇయర్ వేడుకలపై ఆంక్షలు

- అదనపు డీసీపీ జయరాం

నిజామాబాద్ క్రైం, డిసెంబర్ 28 : డిసెంబర్ 31న నిర్వహించే న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా పోలీసులు ఆంక్షలు విధించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని అదనపు డీసీపీ జయరాం హెచ్చరించారు. ఈమేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. పోలీసుల అనుమతి లేకుండా న్యూ ఇయర్ వేడుకలు నిర్వహించవద్దని పేర్కొన్నారు. పటాకులు కాల్చడం, ఆర్కెస్ట్రా, డీజే సిస్టం ఏర్పాటు నిషిద్ధమని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగవద్దని, గుంపులు గుంపులుగా రోడ్లపై తిరుగుతూ కేకలు వేయడం, వాహనాలతో ర్యాలీలు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సాయంత్రం 6 గంటల నుంచి పోలీస్ స్పెషల్ పార్టీ బృందాల ఆధ్వర్యంలో ప్రధాన కూడళ్ల వద్ద వాహనాల తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాను నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గురువారం పుష్పగుచ్ఛాన్ని అందజేసి సన్మానించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన బీజేపీ రాష్ట్ర స్థాయి సమావేశానికి అమిత్‌షా హాజరుకావడంతో సన్మానించారు. అర్బన్ ఎమ్మెల్యేగా గెలుపొందడంపై ధన్‌పాల్ సూర్యనారాయణకు అమిత్‌షా అభినందనలు తెలిపారు.

– నిజామాబాద్ క్రైం,డిసెంబర్28

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ టోర్నీకి సుద్దులం విద్యార్థి

నర్సింహాచారిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఇందల్వాయి, డిసెంబర్ 28 : మండలంలోని సుద్దులంలో ఉన్న జడ్పీహెచ్ఎస్ పదో తరగతి విద్యార్థి కె. నర్సింహాచారి జూనియర్ విభాగంలో రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు విద్యాకమిటీ చైర్మన్ భూమేశ్, పాఠశాల హెచ్ఎం గంగారాం తెలిపారు. నాగార్జునసాగర్‌లో త్వరలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. విద్యార్థిని ఉపాధ్యాయ బృందం గురువారం అభినందించింది.

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపిక

భీమ్‌గల్, డిసెంబర్ 28: పల్లికొండ ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థినులు బి.సంజన, ఎ.స్వామి, పి.శ్రీజ అండర్–19 విభాగంలో రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం అనురాధ గురువారం తెలిపారు. ఈనెల 30, 31, జనవరి 1న నల్గొండ జిల్లా నాగార్జునసాగర్‌లో నిర్వహించనున్న పోటీల్లో వారు పాల్గొంటారని పీఈటీ బి.రమేశ్‌గౌడ్ తెలిపారు.

ఒకరిపై దాడి.. కేసు నమోదు

నందిపేట్, డిసెంబర్ 28: మండల కేంద్రానికి చెందిన కస్తూరి గంగాధర్ అనే వ్యక్తిపై దాడి చేసిన సయ్యద్ ఇర్ఫాన్‌పై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. ఏఎస్సై కథనం మేరకు.. గంగాధర్ ఆర్మూర్ బైపాస్ రోడ్డు పక్కన టైలర్ షాపు నడుపుతుంటాడు. ద్విచక్ర వాహనంపై రోడ్డు దాటే సమయంలో ఇర్ఫాన్, గంగాధర్‌కు మధ్య గొడవ ఏర్పడింది. గంగాధర్‌పై ఇర్ఫాన్ దాడి చేసి గాయపర్చాడు. బాధితుడు గంగాధర్ ఫిర్యాదు మేరకు ఇర్ఫాన్‌పై 4 సెక్షన్లలో కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై వివరించారు.

విద్యార్థులకు కంటి, దంత పరీక్షలు

విద్యార్థికి కంటి అద్దాలు అందజేస్తున్న మేయర్ నీతూకిరణ్

ఖలీల్‌వాడి, డిసెంబర్ 28 : జిల్లాకేంద్రంలోని నాగారం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సూర్య ఆరోగ్య సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా కంటి, దంత పరీక్షలను గురువారం నిర్వహించారు. మేయర్ దండు నీతూకిరణ్ సహకారంతో వైద్యపరీక్షలు నిర్వహించి, మందులను అందజేసినట్లు ఆరోగ్య సంస్థ ప్రతినిధులు తెలిపారు. పలువురు విద్యార్థులకు కంటి అద్దాలను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు వినోద్, ప్రశాంత్, శ్రీకాంత్, నితీశ్ కుమార్, సిబ్బంది, హెచ్ఎం వాసుదేవారావు, రాంచంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న క్రీడా పోటీలు

మాక్లూర్, డిసెంబర్28: మండలంలోని మెట్టు గ్రామంలో క్రిస్మస్ వేడుకల్లో భాగంగా రెండో రోజు గురువారం కబడ్డీ పోటీలు నిర్వహించారు. 16 జట్లు పాల్గొన్నాయని నిర్వాహకులు, పీఈటీ రాజు తెలిపారు. శుక్రవారం ఫుట్‌బాల్, క్యారం, చెస్, టెన్నికాయిట్ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు.

జగదాంబ, సేవాలాల్ విగ్రహాల ప్రతిష్ఠాపన

నవీపేట, డిసెంబర్ 28:మండల కేంద్రంలోని దర్యాపూర్ తండాలో నూతనంగా నిర్మించిన ఆలయంలో గురువారం జగదాంబ, సేవాలాల్ మహరాజ్ విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలు బంజారా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మూడు రోజులుగా ఈ ఉత్సవాలు కొనసాగుతున్నాయి.

'అయోధ్య పూజిత అక్షింతల' మహాశోభాయాత్ర

బోధన్‌లో మహాశోభాయాత్రలో చిలుకూరు శివాలయ ప్రధాన అర్చకుడు సురేశ్ ఆత్మారాం మహరాజ్, హిందూ సంఘాల యువకులు

నందిపేట్‌లో శోభాయాత్రలో పాల్గొన్న మంగిరాములు మహరాజ్, పిట్ల కృష్ణ మహరాజ్

శక్కర్‌నగర్, డిసెంబర్ 28: బోధన్‌లో 'అయోధ్య పూజిత అక్షింతల' మహాశోభాయాత్ర నిర్వహించారు. ఈ అక్షింతల కలశాన్ని రథంపై ఉంచి బోధన్ పట్టణ శివారులోని ఆచన్‌పల్లి చౌరస్తా నుంచి శ్రీ చక్రేశ్వర శివమందిరం వరకు పలు రథాలపై ఊరేగింపుగా శోభాయాత్రను కొనసాగించారు. ముఖ్య అతిథిగా చిలుకూరు శివాలయ ప్రధాన అర్చకుడు శ్రీ రామదాసి సురేశ్ ఆత్మారాం మహరాజ్, పలువురు హిందూ సంఘాల యువకులతో కలిసి శోభాయాత్రలో పాల్గొన్నారు.

నందిపేట్‌లో..

నందిపేట్, డిసెంబర్ 28: మండల కేంద్రంలో అయోధ్య పూజిత అంక్షితల శోభాయాత్ర నిర్వహించారు. కేదారేశ్వర ఆశ్రమ వ్యవస్థాపకుడు మంగిరాములు మహరాజ్, మల్లారం లింగేశ్వరగుట్ట స్వామిజీ పిట్ల కృష్ణ మహరాజ్ ముఖ్య అతిథులుగా హాజరై శోభాయాత్రలో పాల్గొన్నారు. వందలాది మంది భక్తులు శోభాయాత్రలో పాల్గొన్నారు.

అయోధ్య రామయ్య కలశానికి పూజలు

ఏర్గట్ల, డిసెంబర్ 28: అయోధ్య రామాలయం నుంచి వచ్చిన కలశానికి దోంచంద హనుమాన్ ఆలయంలో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్తులు పూజలు నిర్వహించారు. కలశాన్ని మహిళలు మంగళ హారతులతో ఊరేగించారు.

'ప్రజాపాలన' సభల తనిఖీ

ఆర్మూర్‌టౌన్, డిసెంబర్28: ఆర్మూర్ మండలంలోని ఖానాపూర్ గ్రామం, మాక్లూర్ మండలంలోని ఆమ్రాద్ తండాలో ప్రజాపాలన, అభయహస్తం గ్యారెంటీల దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని అడిషనల్ కలెక్టర్ చిత్రమిశ్రా గురువారం తనిఖీ చేశారు. ఆర్మూర్ పట్టణంలోని 36 వ వార్డులో ప్రజాపాలన కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహాన్ తనిఖీ చేశారు. ఆరు గ్యారంటీ పథకాల కౌంటర్‌లను పరశీలించారు.

మాక్లూర్ మండలం ఆమ్రాద్‌తండాలో దరఖాస్తులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ చిత్రమిశ్రా

వాహనాలపై ఉన్న చలాన్లను వెంటనే చెల్లించాలి

ధర్పల్లి, డిసెంబర్ 28 : వాహనాలపై ఉన్న చలాన్ల చెల్లింపులో ప్రభుత్వం సబ్సిడీ ప్రకటించిందని, వాహనదారులు సద్వినియోగం చేసుకోవాలని ధర్పల్లి సీఐ సైదా గురువారం ఒక ప్రకటనలో సూచించారు. ద్విచక్రవాహనాలు, ఆటోలకు 80 శాతం, కార్లు, భారీ వాహనాలకు 60 శాతం తగ్గింపుతో చలాన్లు చెల్లించాలని ప్రభుత్వం సూచించిందని, ఈ అవకాశాన్ని వాహనదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేయించాలి

ఇందల్వాయి, డిసెంబర్ 28 : టీయూ రిజిస్ట్రార్ ఆచార్య యాదగిరిని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ బుస్సా ఆంజనేయులు గురువారం టీయూలో కలిశారు. తలసేమియా వ్యాధి సోకిన పిల్లల కోసం రక్తం అవసరమని పేర్కొన్నారు. రక్తకొరత నేపథ్యంలో యూనివర్సిటీ పరిధిలోని అన్ని కళాశాలల్లో ప్రతి విద్యా సంవత్సరంలో కనీసం రెండుసార్లు రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయాలని కోరారు. గ్రామాల్లో ఎన్ఎస్ఎస్ చేపడుతున్న సేవా కార్యక్రమాల్లో యువతకు రక్తదానంపై అవగాహన కల్పిస్తూ, రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడానికి తగిన మార్గదర్శకాలను అందించాలని కోరుతూ వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ఆరతి, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ కె.రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రతన్ టాటా జన్మదిన వేడుకలు

జన్మదిన వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

ఇందల్వాయి, డిసెంబర్ 28 : మండలంలోని ధర్మారం(బీ) గ్రామంలో ఉన్న జీనియస్ పాఠశాలలో రతన్ టాటా జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేశారు. రతన్ టాటా గొప్పతనం, కరోనా సమయంలో దేశానికి అందించిన విరాళాల గురించి కరస్పాండెంట్ గంగారెడ్డి విద్యార్థులకు వివరించారు. అనంతరం పాఠశాలలో మొక్కలు నాటారు.

రైల్వే ఎస్‌హెచ్‌వోగా సాయిరెడ్డి

హెచ్.సాయిరెడ్డి

నిజామాబాద్ క్రైం, డిసెంబర్ 28 : నిజామాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వోగా హెచ్.సాయిరెడ్డి గురువారం బాధ్యతలను స్వీకరించారు. కామారెడ్డి జిల్లా భిక్కనూర్ సర్కిల్ పరిధిలోని బీబీపేట్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వోగా విధులు నిర్వర్తిస్తున్న సాయిరెడ్డిని ఉన్నతాధికారులు నిజామాబాద్ రైల్వేకు బదిలీ చేశారు. ఇప్పటివరకు ఇక్కడ ఎస్సైగా కొనసాగిన తాహునాయక్ బదిలీ కావడంతో ఆయన స్థానంలో ఎస్‌హెచ్‌వోగా సాయిరెడ్డి చార్జ్ తీసుకున్నారు. ఎస్‌హెచ్‌వోకు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ

ఖలీల్‌వాడి, డిసెంబర్ 28 : నగరంలోని జోస్ ఆలుక్కాస్ ప్రాంగణంలో వాసవి జనతా ఫౌండేషన్ ప్రతినిధులు నిరుపేదలకు నిత్యావసర సరుకులను గురువారం పంపిణీ చేశారు. సుమారు 100 మంది నిరుపేదలకు నెలకు సరిపడా నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రతినిధులు మోటూరి లక్ష్మణ్, నంగునూరి నితిన్, శెనిశెట్టి అభినయ్, బచ్చు సాయికృష్ణ , మహాజన్ స్నేహిత్, కంటాల్‌వార్ సొరభ్, పార్శి వెంకటేశ్, గూడెపు సాయికృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా మహాలక్ష్మి ఆలయ వార్షికోత్సవం

నిజామాబాద్ రూరల్, డిసెంబర్ 28 : మండలంలోని కేశాపూర్‌లో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహాలక్ష్మీ ఆలయ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. అర్చకుడు గోవింద్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు కొనసాగాయి. భాజాభజంత్రీల మధ్య అమ్మవారి ఉత్సవమూర్తిని గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

జాతీయ సదస్సులో జిల్లా ఉద్యోగులు

సదస్సులో పాల్గొన్న జిల్లా ఉద్యోగులు

ఖలీల్‌వాడి, డిసెంబర్ 28 : అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య కౌన్సిల్ సమావేశాలు కోల్‌కతాలోని ఈస్టర్న్ జోనల్ కల్చరల్ సెంటర్‌లో కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ఉద్యోగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతినిధులతో భారీ ర్యాలీ నిర్వహించారు. నిజామాబాద్ ఉద్యోగుల సంఘం జిల్లా చైర్మన్ అలుక కిషన్ అధ్యక్షతన జిల్లా ఉద్యోగులో ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పోల శ్రీనివాస్, ఆకుల ప్రసాద్, వేణుగోపాల్, దినేశ్ బాబు, జాకీర్ హుస్సేన్, ఉమాకిరణ్, విశాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శబరిమలలో మహా అన్నదానానికి బియ్యం సరఫరా

కోటగిరి, డిసెంబర్ 28 : శబరిమలలో నిర్వహించే మహా అన్నదాన కార్యక్రమానికి పొతంగల్ అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో బియ్యాన్ని గురువారం పంపించారు. మండలకేంద్రంలో దాతల సహకారంతో రూ. 49 వేల విలువ చేసే 12 క్వింటాళ్ల బియ్యాన్ని పంపినట్లు గురుస్వాములు శంకర్, రాధాకృష్ణ, డాక్టర్ సితాలే రమేశ్ తెలిపారు. జనవరి 6 నుంచి 13వ తేదీ వరకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తారని చెప్పారు. శాంతేశ్‌పటేల్, నర్సయ్య, యశ్వంత్‌రెడ్డి, బచ్చు శేఖర్, సూదం నవీన్, మోహన్‌రావు, సితాలే రమేశ్, దులప్ప పటేల్, మాలధారులు, వివేకానంద యూత్ సభ్యులు పాల్గొన్నారు.

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా Central Bank of India నిజామాబాద్ శాఖ

[రూల్–8(1)] SARFAESI రూల్ క్రింద స్వాధీనతా ప్రకటన

దిగువ సంతకందారు **సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నిజామాబాద్ శాఖ** యొక్క అధీకృత అధికారిగా సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) మరియు సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించి, సదరు నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజుల్లోగా నోటీసు నందు వివరించబడిన మొత్తం **రూ. 16,69,750.58/-** (పదహారు లక్షల అరవై తొమ్మిదివేల ఏడు వందల యాభై రూపాయల యాభై ఎనిమిది పైసలు మాత్రమే)లను తిరిగి చెల్లించవలసిందిగా **రుణగ్రహీత: శ్రీమతి రేష్మ బేగం, భర్త మహమ్మద్ అయూబ్ ఖాన్ మరియు శ్రీ మహమ్మద్ అయూబ్ ఖాన్, తండ్రి లేట్ బాబూఖాన్** వారిని కోరుతూ **తేది: 12.04.2023**గల **డిమాండ్ నోటీసును** జారీ చేసినారు.

రుణగ్రహీతలు బ్యాంక్ మొత్తం బకాయిలు తిరిగి చెల్లించుటలో విఫలం కావడం చేత సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8తో చదువబడే సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగించి దిగువ వివరించబడిన ఆస్తిని దిగువ సంతకందారు **26 డిసెంబర్, 2023**న స్వాధీనం చేసుకున్నారని ప్రత్యేకించి రుణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది.

సదరు ఆస్తితో ఏ విధమైన లావాదేవీ నిర్వహించరాదని మరియు సదరు ఆస్తితో నిర్వహించబడు ఏవేని లావాదేవీలు **రూ. 1734898.00** (పదిహేడు లక్షల ముప్పై నాలుగు వేల ఎనిమిది వందల తొంభై ఎనిమిది రూపాయలు మాత్రమే) (26.12.2023 నాటికి బకాయి అసలు+ వడ్డీలను సూచిస్తుంది)+ 27.12.2023 నుండి దానిపై వడ్డీ మరియు రాబట్టుకొను తేదీ వరకు ఇతర ఖర్చులు సదరు కలిపి మొత్తం కొరకు **సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా** యొక్క చార్జ్‌కు లోబడి ఉంటాయని ప్రత్యేకించి రుణగ్రహీతలను మరియు సాధారణ ప్రజానీకాన్ని ఇందుమూలంగా హెచ్చరించడమైనది.

సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు అందుబాటులో గల సమయానికి సంబంధించి SARFAESI చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్–సెక్షన్ (8) నిబంధనలను గమనించవలసిందిగా రుణగ్రహీతలకు తెలియజేయడమైనది.

స్థిరాస్తి వివరణ

ఆస్తి యజమాని–శ్రీమతి రేష్మ బేగం మరియు శ్రీ మహమ్మద్ అయూబ్ ఖాన్ : సేల్ డీడ్ నం. 9779/2019 ప్రకారం దిగువ తెలిపిన సరిహద్దులతో 115.83 చ.గజాల మొత్తం విస్తీర్ణంతో నిజామాబాద్, హజామ్ కాలనీ (హబ్బి కాలనీ), బ్లాక్ నం.13, వార్డ్ నం.9లోగల మున్సిపల్ నంబర్ 9–13–337 కలిగిన ఖాళీ స్థలం (గ్రౌండ్ మరియు మొదటి అంతస్తు కలిగినదితో RCC రూఫ్డ్ నివాస ఇల్లు. ఉత్తరం: మహమ్మద్ షబ్బీర్ ఇల్లు, దక్షిణం: 10 అడుగుల లేన్, తూర్పు: అస్లాం ఇల్లు, పడమర: 15 అడుగుల వెడల్పు రోడ్.

ప్రదేశం: నిజామాబాద్ అధీకృత అధికారి,
తేది: 26.12.2023 సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

వంద రోజులు కష్ట పడితే మంచి భవిష్యత్తు

కమ్మర్‌పల్లి, డిసెంబర్ 28: టెన్త్ విద్యార్థులు వచ్చే వంద రోజులు వృథా చేయకుండా ప్రణాళికాబద్ధంగా చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని ఎంఈవో ఆంధ్రయ్య అన్నారు. గురువారం కోనాపూర్ జడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులతో ఆయన మాట్లాడారు. ఉత్తమ గ్రేడ్ సాధించి ట్రిపుల్ ఐటీలో అధిక సంఖ్యలో విద్యార్థులు ప్రవేశాలు సాధించాలన్నారు. అనంతరం కేసీ తండాలో ఎఫ్ఎల్ఎన్ పథకం అమలును పరిశీలించారు. ఆయన వెంట హెచ్ఎం సీహెచ్.రాంప్రసాద్, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఐసీఐసీఐ ఫౌండేషన్ బృందానికి సన్మానం

కమ్మర్‌పల్లి, డిసెంబర్ 28: తమ గ్రామంలో సేవలు అందించినందుకు కృతజ్ఞతగా ఐసీఐసీఐ ఫౌండేషన్ బృందాన్ని గురువారం నాగాపూర్ గ్రామస్తులు సన్మానించారు. గ్రామంలో ఐసీఐసీఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.30 లక్షలతో చెరువు తూము నుంచి కొత్త కాలువ నిర్మించారు. చెరువులో చేపలు బయటికి వెళ్లకుండా ఇనుపజాలి ఏర్పాటుకు రూ.10 లక్షలు మంజూరు చేశారు. మరమ్మతు చేపట్టిన కాలువ నుంచి గురువారం నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ పల్నాటి రజనీకాంత్, డీవో అఖిల, టీఎఫ్ చింత శ్రీనివాస్‌ను సర్పంచ్ పాలెపు సాయమ్మ, ఎంపీటీసీ దుబ్బాక సుప్రియ, వీడీసీ అధ్యక్షుడు బసకొండ మహేశ్ సన్మానించి ధన్యవాదాలు తెలిపారు.

ఫౌండేషన్ బృందంతో నాగాపూర్ గ్రామస్తులు

బస్సు సౌకర్యం కల్పిస్తాం: ఆర్టీసీ డీఎం

రెంజల్, డిసెంబర్ 28: 'రోడ్లు బాగాయే..బస్సులు కరువాయే' శీర్షికన 'నమస్తే తెలంగాణ'లో గురువారం ప్రచురితమైన కథనానికి ఆర్టీసీ అధికారులు స్పందించారు. మండలంలోని బాగేపల్లి, కందకుర్తి వరకు త్వరలో బస్సు సౌకర్యం కల్పిస్తామని నిజామాబాద్–2 డిపో మేనేజర్ ఎన్.సాయన్న తెలిపారు. గురువారం నమస్తే తెలంగాణతో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. డిపోనకు కొత్త బస్సులు రాగానే బాగేపల్లి, కందకుర్తి మార్గాల్లో నవీపేట మీదుగా నిజామాబాద్‌కు అవసరం మేరకు బస్సులు నడిపించేందుకు చర్యలు తీసుకుంటామని నిజామాబాద్ –2 డిపో మేనేజర్ తెలిపారు. మహాలక్ష్మి పథకం ద్వారా ప్రతి గ్రామానికి చెందిన మహిళలు సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

బోధన్ రూరల్, డిసెంబర్ 28: సంగం ప్రాథమిక పాఠశాల